ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా!

పరమ భక్తుడు, వేదపురుషుడు, ఇక్కడ మొట్టమొదట వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞమని ప్రారంభించినప్పుడు ప్రశాంతినిలయము చేరుకున్నాడు. ఆనాటి మొదలు ఈనాటి వరకు ఏకధారగా భక్తిప్రపత్తులతో స్వామిచింతనచేస్తూ ఉండేవాడు. తన స్వగ్రామమునకు ఈనాటివరకు, 30 సంవత్సరములనుండి పోలేదు.

పట్టినదేదియో పట్టనే పట్టితివి
పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితివి
కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితివి
అడిగినదిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితివి
తలపు తీరెడుదాక తరలకుండు
పోరుపడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక తానైన అడుగవలయు
అతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగిపోవుట భక్తుని దీక్షకాదు.

అన్నారు. అట్టి దీక్షతో ప్రశాంతినిలయములో కాలము గడుపుతూ ఈనాటికి నూరు సంవత్సరములు నిండుతున్నాయి. ఆ వ్యక్తి నేటికికూడా వేదాన్ని వల్లిస్తూనే ఉన్నాడు. అతని పేరుతో ఐదు సంవత్సరముల పూర్వము 'వేదశాస్త్రపరిషత్' అని పెట్టారు. నేడు కూడను వేదాధ్యయనము చేసేవారికి ఏదో అంతోయింతో సహాయముచేసి వారిని ఉద్ధరించాలని ఉద్దేశ్యము. వేదములు తెలియకపోవటంచేతనే వేదార్థమును చక్కగా గుర్తించలేకపోతున్నారు భరతీయులు. సర్వజీవిత సారమంతయు వేదములనే యిమిడి ఉంటున్నది. ఈనాడు అతనికి నూరు సంవత్సరములు కావటంచేత అతనియొక్క వేదశాస్త్ర పరిషత్ పేరుతో మా సెంట్రల్ ట్రస్టు తరఫున ఒక లక్షరూపాయలు అతనికి అందిస్తున్నాము. వేదాధ్యయనమే ప్రధాన లక్ష్యముగా గల అతనే నూరు సంవత్సరముల పండిన పండు, చెరుకుమిల్లి కామావధాని.

పూర్ణచంద్ర,

26.07.91.